## క్లుప్తంగా

### ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

**చీపురుపల్లి:** మండలంలోని పుర్రేయవలస గ్రామంలో నిర్మిస్తున్న శివాలయానికి పట్టణానికి చెందిన జాస్తి వెంకటేశ్వరరావు, ఆచంట రామచంద్రరావు లక్ష రూపాయలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని బుధవారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కంది శ్రీరాములు, గురాన జనార్దన్, సిరేల శ్రీను, సారిక ఆనంద్, గురాన సత్యనారాయణ, కోరాడ సూరి తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక లారీ పట్టివేత

**గుర్ల:** మండలంలోని కోటగండ్రేడు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని ఎస్సై హరి బాబునాయుడు బుధవారం పట్టుకున్నారు. లారీని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### నేడు ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

**లక్కవరపుకోట:** మండలంలోని తలారి గ్రామంలో ఉపాధిహామీ నిధులతో నూతనంగా నిర్మించిన రైతుభరోసా, వెల్‌నెస్ కేంద్రాలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేతులమీదగా గురువారం ప్రారంభించనున్నట్లు పంచాయతీరాజ్ జేఈ వీరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బీకేని రూ.21.8 లక్షలతోను, వెల్‌నెస్ కేంద్రాన్ని రూ.17.5 లక్షలతోను నిర్మించినట్లు ఆమె తెలిపారు.

### లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

**కొత్తవలస:** కేసుల సత్వర పరిష్కారమే లోక్‌అదాలత్ లక్ష్యమని, కక్షిదారులు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ కమిటీ చైర్మన్, కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయ్‌చంద్ర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 13న నిర్వహించనున్న మెగా లోక్‌అదాలత్‌లో కక్షిదారులందరూ పాల్గొని కేసుల నుంచి బయటపడవచ్చన్నారు. కేసులను రాజీ చేసుకుంటే భవిష్యత్‌లో అప్పీలు చేసుకునేందుకు అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కక్షిదారులు వారి కేసులను రాజీ చేసుకుంటే ఇరు పార్టీలు విజయం సాధించినట్లేన్నారు. సమయం, డబ్బు వృథా కాదన్నారు.

### పరిశోధన ప్రాజెక్టుకు ఎంపిక



డా. రామానాయుడు

**శృంగవరపుకోట:** మండలంలో వీరనారాయణం గ్రామానికి చెందిన డాక్టర్ రంధి రామానాయుడుకి 'నేషనల్ బోర్డ్ ఆఫ్ హయ్యర్ మాథమెటిక్స్' రీసెర్చ్ ప్రాజెక్టును అప్పగించింది. 'మోడల్ బేస్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెథడ్స్ ఫర్ స్పార్స్ సిగ్నల్ రికవరీ థియరీ అండ్ అప్లికేషన్స్ ఇన్ ఇమేజింగ్' పరిశోధనలో భాగంగా కృత్రిమ మేధ(ఎ.ఐ)తో వైద్య, వ్యవసాయ రంగాల్లో అల్గోరిథమ్స్ తయారు చేయటమే తన లక్ష్యమని రామానాయుడు తెలిపారు. ప్రస్తుతం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీలో సహాయ ఆచార్యునిగా పనిచేస్తున్న రామానాయుడు గతంలో యంగ్ సైంటిస్ట్ అవార్డు అందుకున్నారు. భారత అణుశక్తి సంస్థ మూడేళ్ల పాటు నిర్వహించనున్న ఈ ప్రాజెక్టుకు రామానాయుడును ఎంపిక చేయటం పట్ల స్థానికులు, మిత్రులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

**దత్తిరాజేరు:** మండలంలో పి.లింగాలవలస కూడలి నుంచి గ్రామం వరకు ఏఎంసీ నిధులు రూ.90 లక్షలతో చేపడుతున్న తారు రోడ్డు విస్తరణ పనులను పీఆర్ జేఈ అప్పలనాయుడు బుధవారం పరిశీలించారు. రోడ్డును చదును చేసి మెటల్ వేయడం జరిగిందన్నారు. మరో వారం రోజుల్లో పనులు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. అనంతరం వింధ్యవాసి తారు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.

### పీవీరావుకు నివాళి



పీవీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దళిత నేతలు

**వేపాడ:** మండల కేంద్రమైన వేపాడలో మాలమహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా పోరాడిన మహానేత పి.వి.రావు 74వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పి.వి.రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ పి.వి.రావు అగ్రకుల అనువాద ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన పి.వి.రావు జీవితం ఆదర్శనీయమన్నారు. పోరాటలతో ప్రభుత్వ ఉద్యోగం కోల్పోయి ఎన్నో కష్టనష్టాలకు ఓర్చారన్నారు. దళిత జాతి ఐక్యత కోసం అంతిమ శ్వాస విడిచేవరకు పోరాటం సాగించిన నాయకుడు పి.వి.రావు అని కొనియాడారు. కార్యక్రమంలో మాలమహానాయుడు అధ్యక్ష, కార్యదర్శులు దేబార్కి కిరణ్, సీహెచ్ బంగారయ్య, యూత్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషిచేయాలి

• ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య




మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

**గజపతినగరం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యారంగం అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. బుధవారం గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయి ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా గత ఏడాది, ప్రస్తుత ఏడాది విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. నాడు నేడులో భాగంగా సర్కారు పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నప్పటికీ ఉత్తీర్ణత శాతం ఎందుకు పెరగడం లేదని? ఎక్కడ లోపాలు ఉన్నాయని ప్రశ్నించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, ఇతర మేజర్ సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని, వాటిని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని అన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రతీ హైస్కూల్‌ను ఇంటర్ కళాశాలగా మార్చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని, విద్యతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని అన్నారు.

**నిఘాపెట్టండి**

పాఠశాలల ప్రాంగణంలో, ఇతర ప్రాంతాల్లో కొంత మంది యువత గంజాయి, తదితర మత్తుపదార్థాలకు అలవాటు పడినట్లు తెలుస్తోందని, విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిస కాకుండా ఉపాధ్యాయులు నిఘా పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు. గంజాయి ఎక్కడ నుంచి వస్తోంది, వాటిని ఎవరు ఈ ప్రాంతానికి పరిచయం చేస్తున్నారన్న దానిపై పోలీసుల సహకారంతో చెక్ పెట్టేందుకు అందరం కృషిచేద్దామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, ఏఎంసీ చైర్మన్ వి.ముత్యాలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.వెంకటరావు, ఎంఈఓ విమలమ్మ, రెడ్డి పద్మావతి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయకుమారి, నాలుగు మండలాల ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

# చట్టబద్ధంగా వ్యాపారాలు సాగించాలి

• వ్యవసాయశాఖ జేడీ కేటీ రామారావు



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ కేటీ రామారావు

**చీపురుపల్లి:** విత్తనాలు, ఎరువులు విక్రయించే రైతులు చట్టబద్ధంగా వ్యాపారాలు సాగించాలని, లేదంటే లైసెన్స్‌లు రద్దు చేయడం జరుగుతుందని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కేటీ రామారావు హెచ్చరించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చీపురుపల్లి వ్యవసాయశాఖ సబ్ డివిజినల్ స్థాయిలో విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయించే డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు సాగించాలనుకుంటే కుదరదని స్పష్టం చేశారు. డీలర్లు తెప్పించుకునే సరుకులు నుంచి విక్రయించే సరుకుల వరకు వివరాలన్నీ వ్యవసాయశాఖకు తెలియజేయాల్సి ఉందన్నారు. అంతేకాకుండా తప్పనిసరిగా రికార్డులు నిర్వహించాలన్నారు. విత్తనాలు స్టాకు వచ్చినప్పుడే మొలకశాతం కట్టాలని, అదే విషయాన్ని మండల వ్యవసాయ అధికారులు దృష్టికి తీసుకెళ్లాలన్నారు. వ్యవసాయ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తరువాతే విక్రయాలు జరపాలని సూచించారు. ఖరీఫ్ సమీపిస్తున్న తరుణంలో విత్తనాలు స్టాకు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి రాయితీపై విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీ ఎస్.కోటేశ్వరరావు, ఏఓలు సీహెచ్.రఘుపతినాయుడు, టి.సంగీత, తిరుపతిరావు పాల్గొన్నారు.

# స్కిల్ హబ్ ప్రారంభం



స్కిల్ హబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

**గజపతినగరం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఏపీ స్టేట్ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, నిరుద్యోగ యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ స్కిల్ హబ్‌లో యువతకు పారిశ్రామిక అవసరాలకు తగిన నైపుణ శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ డైరెక్టర్ రెడ్డి పద్మావతి, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, స్కిల్ డవలప్‌మెంట్ జిల్లా అధికారి డాక్టర్ ఎస్.గోవిందరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.విజయకుమారి, తహసీల్దార్ ఎం.అరుణకుమారి, ఎంపీడీఓ పి.సుదర్శనం, సీనియర్ నేతలు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ గడపలో సంతోషం



మహిళకు సంక్షేమ లబ్ధిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

• ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

**లక్కవరపుకోట:** ప్రతీ కుటుంబం సంతోషంగా ఉండాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దాసుళ్లపాలెం గ్రామంలో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, గ్రామంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను అక్కడికక్కడే సచివాలయ సిబ్బందితో నమోదు చేయించి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయని, రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారయణ, వైస్ ఎంపీపీ ఆవాల శ్యామల, సర్పంచ్ ముమ్మన ధనలక్ష్మి, భీమాళి సర్పంచ్ కొయ్యాన కృష్ణ, పార్టీ నాయకులు ముమ్మన ప్రసాదరావు, పిల్లల జ్యోతీరావ్ తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

**దత్తిరాజేరు:** వేసవిలో తాగునీటి సమస్య ఉంటే తెలియజేయాలని గ్రామీణ నీటి సరఫరా జేఈ నాని బాబు అన్నారు. బుధవారం గుచ్చిమి గ్రామంలో లీకైన వాటర్ పైపులను పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంగిలాపల్లిలో కూడా తాగునీరు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

### బ్యాడ్మింటన్, యోగా శిక్షణ శిబిరం



యోగాసనాల పై శిక్షణ ఇస్తున్న పీడీ శ్రీరాములు

**శృంగవరపుకోట:** మండలంలో ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీరాములు నేతృత్వంలో నడుస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో బ్యాడ్మింటన్ శిక్షణతో పాటూ యోగా శిక్షణ ఇస్తున్నారు. ఉదయం బ్యాడ్మింటన్, సాయంత్రం యోగాలో శిక్షణ ఇస్తున్నట్లు పీడీ తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు విద్యార్థులకు యోగాసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం, క్రియలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

### ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరండి



ప్రవేశాల కోసం ప్రచారం చేస్తున్న ధర్మవరం హైస్కూల్ ఉపాధ్యాయులు

**శృంగవరపుకోట:** మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మహిళా జూనియర్ కాలేజీలో ప్రవేశాల కోసం ఉపాధ్యాయులు బుధవారం ప్రచారం చేశారు. బాలికల కోసం అన్ని వసతులతో జూనియర్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పదోతరగతి పాసైన బాలికలంతా ఈ కళాశాలలో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

• ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

**బొండపల్లి:**

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని కెరటాం గ్రామంలో బుధవారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పలనరసయ్య మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకునేందుకే గడపగపడకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 30 పడకల ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశామని, ప్రస్తుతం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. మరో రెండు నెలల్లో పనులు పూర్తిచేసి రోగులకు అత్యాధునిక వైద్య సేవలను ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే రూ.100 కోట్లుతో జాతీయ రహదారి 26 విస్తరణ పనులు చేపడుతున్నామని, త్వరలోనే పనులు పూర్తవుతాయన్నారు. గజపతినగరంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయడంతో పాటు ఈ విద్యా సంవత్సరంలో పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ఇంకా పారదర్శకంగా పాలన సాగించేందుకు గాను క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు బి.వి.ప్రభాజీ, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, మాజీ ఎంపీపీ బండారు బంగారం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, గ్రామ సర్పంచ్ నంబూరి రాజేష్(బుజ్జిరాజు), వైఎస్సార్‌సీపీ నాయకులు జి.ఎస్.ఎస్.వర్మ, తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఎ.వేదవతి, బోద్దల చిన్నంనాయుడు, మీసాల తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉపాధి పనులు



ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న ఏపీడీ ఎస్.శారదాదేవి

**లక్కవరపుకోట:** మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ప్రతీ ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు విధిగా పనులు కల్పించాలని ఆశాఖ ఏపీడీ ఎస్.శారదాదేవి ఆదేశించారు. మండల కేంద్రంలోని ఉపాధిహామీ భవనంలో వేపాడ, ఎల్.కోట, కొత్తవలస, జామి, ఎస్.కోట, గంట్యాడ మండలాలకు చెందిన ఉపాధిహామీ ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ సహాయకులతో ఆమె బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాలు వారీగా ఎస్సీ, ఎస్టీ కులాల జనాభాను సేకరించి ఉపాధిపనులకు అర్హత కల్గిన వారిని గుర్తించాలన్నారు. వారికి జాబ్‌కార్డులు మంజూరు చేసి పనులు కల్పించాలన్నారు. అలాగే నలుగురు వ్యక్తుల కన్నా ఎక్కువ వ్యక్తులు ఉన్న జాబ్ కార్డులను ఆయా కార్డుల నుంచి తొలిగించి కొత్త జాబ్‌కార్డులను అందజేయాలన్నారు. అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ మండలానికి ఒక్కొక్క చెరువును గుర్తించి ఆ చెరువును మోడల్ చెరువుగా ఆధునికీకరించాలన్నారు. ఒక్కో చెరువుకు మెటీరియల్‌తో పని చేసేందుకు రూ.2లక్షలు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఉద్యావన పంటల పెంపకంలో భాగంగా మామిడి, జీడి, కొబ్బరి తదితర మొక్కలు పెంపకానికి అవకాశం ఉందన్నారు. మొక్కలు నాటేందుకు ఉపాధిహామీ నిధులు చెల్లిస్తామన్నారు. అలాగే మొక్కల పెంపకానికి మూడు సంవత్సరాల నిర్వహణ ఖర్చులను కూడా చెల్లిస్తామన్నారు.

# నిర్మాణాలు వేగవంతం చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ పట్నాయక్

**వేపాడ:** గ్రామ సచివాలయ సముదాయ భవన నిర్మాణాలు త్వరితగతని పూర్తి చేయాలని ఎంపీడీఓ బీఎస్‌ఎన్‌కే పట్నాయక్ కోరారు. బుధవారం ఆతవ గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది, వలంటీర్ల హాజరు, బయోమెట్రిక్‌తోపాటు మూమెంట్ రిజిష్టరు, ఈ సర్వీసులు, గ్రామంలో పారిశుద్ధ్య పనులు తదితర అంశాలపై సమీక్షించారు. గ్రామ సర్పంచ్ వేమననాయుడుతో మాట్లాడుతూ గ్రామంలో నిర్మాణంలో ఉన్న సచివాలయం, ఆర్‌బీకే భవనాలు త్వరగా పూర్తి చేసేలా చూడాలని కోరారు. వెల్‌నెస్ నిర్మాణంపై ఆరాతీశారు. కార్యక్రమంలో సచివాలయం పంచాయతీ కార్యదర్శి నానిబాబు పాల్గొన్నారు.

# రోజుకు రూ.275 వేతనం



జామి: ఉపాధి పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి

**జామి:** ఉపాధిహామీ వేతనదారులకు రోజుకు రూ.275 వేతనం అందేలా పని కల్పించాలని డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి అన్నారు. మండల కేంద్రంలో ఇరిగేషన్ కాలువల్లో చేపట్టిన పూడికతీత పనులను బుధవారం ఆమె పరిశీలించారు. పనుల అంచనా విలువ, కూలీల సంఖ్య, వేతనదారులకు వస్తున్న కనీస వేతనం, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సాగునీటి కాలువల్లో పూడికల తొలగింపు పనులతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ ఎం.సతీష్, ఏపీఓ కె.శేఖర్, ఎం.కిరణ్మయి, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

**పని ప్రదేశంలో టెంట్లు తప్పనిసరి**

**బొండపల్లి:** ఉపాధి పనుల వద్ద కూలీలకు నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ ఎ.వేదవతి క్షేత్రసహాయకులకు సూచించారు. మండలంలోని బోడసింగిపేటలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. కూలీలు వడదెబ్బకు గురికాకుండా తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ బి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

### హాస్టల్ సదుపాయం కల్పించాలని వినతి

**శృంగవరపుకోట:** ఇంటర్న్‌షిప్ చేస్తున్న డిగ్రీ విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కల్పించాలని ఎస్.ఎఫ్.ఐ నాయకులు బుధవారం ఎస్.కోట ఎమ్మార్వోకు వినతి పత్రం అందచేశారు. ఎస్.ఎఫ్.ఐ నాయకులు చినబాబు మాట్లాడుతూ..ప్రభుత్వం మార్చిన విద్యావిధానంలో డిగ్రీ 3వ సంవత్సరంలో ఇంటర్న్‌షిప్ చేసే కొత్త విదానం ప్రవేశ పెట్టిందన్నారు. దీంతో ఇంటర్న్‌షిప్ క్లాసులు హాజరు కాకుంటే డిగ్రీ సర్టిఫికెట్ అందే పరిస్థితి లేదన్నారు. ఇంటర్న్‌షిప్‌కు హాజరు కావాలంటే హాస్టళ్లు అన్నీ మూసేసిన పరిస్థితి ఉందని. దీంతో ఎక్కడెక్కడో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఉండేందుకు, వసతి, భోజనం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం హాస్టళ్లు తెరిపించి ఇంటర్న్‌షిప్‌కు హాజరయ్యే వారికి వసతి, భోజన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

### రూ.500లకే పశువులకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్

**చీపురుపల్లి రూరల్(గరివిడి):** ఆడదూడలను మాత్రమే పుట్టించగలిగే కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ వైపీ రమణ అన్నారు. జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా గరివిడి మండలం దుమ్మెద గ్రామంలో బుధవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. మేలైన ఆవుదూడలను ఎంపిక చేసి వాటి యజమానులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ఆవులకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు చేయించే పాడిరైతులు రూ.500లు చెల్లిస్తే రెండు సార్లు కృత్రిమ గర్భధారణ చేస్తారని, చూడి నిలబడని పక్షంలో రైతు చెల్లించిన రూ.500లు తిరిగి చెల్లిస్తారని వివరించారు. ఈ పథకంలో ఆడదూడలు కచ్చితంగా జన్మిస్తాయని, మగదూడలు పుట్టిన ఎడల రూ.250లు రైతుకి చెల్లిస్తారని తెలిపారు. అదే విధంగా మండలంలో 50 టన్నుల సంపూర్ణ మిశ్రమదాణాను రైతుభరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నామన్నారు. 200 కిలోల మిశ్రమదాణా కోసం రైతులు రూ.1300లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారులు డీడీ డా.రామచంద్రరావు, సీఈఓ డా.దామోదరరావు, మండల వెటర్నరీ ఆఫీసర్ బి.శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ జమ్ము రామునాయుడు, పాడిరైతులు పాల్గొన్నారు.



దూడలకు వ్యాక్సిన్ అందిస్తున్న పశుసంవర్ధకశాఖ జేడీ వైపీ రమణ